క్లుప్తంగా

ఓ నెగిటివ్ రక్త దానం



రక్తదానం చేస్తున్న అంబర్

గుంతకల్లు: అరుదైన ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేసి ప్రాణదాతగా నిలిచాడు గుంతకల్లుకు చెందిన ఓ రక్తదాత. వివరాల్లోకి ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన షేక్ షఫీఉల్లా ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని రక్తహీనతతో బాధపడుతూ గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. ఆయన ఆరోగ్యం మెరుగుపడలాంటే అత్యవసరంగా ఓ నెగిటివ్ రక్తం అవసరమైంది. విషయాన్ని షఫీఉల్లా బంధువులు జేవీవీ నాయకుడు హరిప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన మిల్లు ఏరియా నివాసముండే ఓ నెగిటివ్ రక్తదాత బంగ్లా షేక్ అంబర్‌ను సంప్రదించారు. వెంటనే స్పందించిన అంబర్ గురువారం పట్టణంలోని బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి ఓ నెగిటివ్ రక్తదానం చేసి ప్రాణదాత నిలిచాడు. ఈ సందర్భంగా అంబర్‌ను పలువురు అభినందించారు.

జాతీయ స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపిక



అర్వాజ్ ఖాన్

గార్లదిన్నె: స్థానిక ముస్లిం మైనారిటీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అర్వాజ్ ఖాన్ జాతీయ స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. ఇప్పటికే అర్వాజ్‌ఖాన్ రెండు సార్లు జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిధ్యం వహించాడన్నారు. ఇటీవల జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఏడో స్థానంలో నిలిచాడన్నారు. శుక్రవారం భువనేశ్వర్‌లోని కళింగలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



మేఘనారాజ్

గుంతకల్లుటౌన్: స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్-17 రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు (54 కిలోల విభాగం) స్థానిక ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని డి.మేఘనారాజ్ ఎంపికైంది. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలిక పాల్గొంటుంది. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం గోపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు వేణుగోపాల్, జ్యోతి, ఎంకె.రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

విద్యా సామగ్రి పంపిణీ

గుంతకల్లు రూరల్: మండలంలోని కొంగనపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థి రామయ్య, అతడి భార్య రాధా కుమారి ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలను అందజేశారు. అదేవిధంగా గ్రామ మాజీ సర్పంచ్ సోమశేఖర్ విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మస్తాన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ దాతలను అభినందించారు.

తొండపాడు హుండీ ఆదాయం రూ.14.91 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలోని బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీ లెక్కింపు ద్వారా రూ.14,91,719 ఆదాయం వచ్చినట్లు ఈఓ శోభ తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అక్కిరెడ్డి సమక్షంలో శాశ్వత హుండీలను లెక్కించారు. 2025 ఫిబ్రవరి నుంచి బుధవారం వరకూ ఎనిమిది నెలల పాటు హుండీల్లో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేవదాయశాఖ బ్యాంకు ఖాతాకు జమ చేస్తామని ఈఓ తెలిపారు. ఎస్ఐ సురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రంగస్వామిరెడ్డియాదవ్, డేగా మద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, అర్చకుడు నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

గుత్తి: స్థానిక ఆర్ఎస్‌లోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న భీమా, శ్రీదేవి దంపతుల కుమారుడు సాయికుమార్ కనిపించడం లేదు. ఆర్ఎస్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. గత సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు తిరిగి ఇంటికి చేరలేదు. తల్లిదండ్రులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మురుగు.. రోడ్డుపై పరుగు



కాలువలో ఇసుకను డంప్ చేయడంతో మురికి నీరు రోడ్డుపైకి వస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక రాజేంద్రనగర్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ విగ్రహం సర్కిల్ వద్ద మురుగు కాలువలో ఇసుక డంప్ చేయడంతో కాలవలోని మురుగంతా రోడ్డుపై పారుతుండటంతో ఇబ్బందిగా మారింది. 15 రోజులు క్రితం వేంకటేశ్వర దేవాలయం మార్గంలో రోడ్డు పనులు నిమిత్తం ఇసుక, కంకరను ఈ సర్కిల్‌లోని కాలువ సమీపంలో డంప్ చేశారు. దీంతో కాలువ మొత్తం ఇసుకతో నిండి.. మురుగు ముందుకు కదలక రోడ్డుపై పారుతుంది. ఈ మార్గంలో వేంకటేశ్వర స్వామి దేవాలయం, చైతన్య పాఠశాలలు, టూటౌన్, ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. భక్తులు, ప్రజలు, విద్యార్థులు మురుగు దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. సంబంధిత కాంట్రాక్ట్ స్పందించి కాలువలో డంప్ చేసిన ఇసుకను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిరుపయోగంగా కుట్టుమిషన్లు



వెలుగు కార్యాలయంలో వృథాగా కుట్టుమిషన్లు

పెద్దపప్పూరు: కుట్టు శిక్షణ పొంది మహిళలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలని గత ప్రభుత్వం మండలానికి 20 కుట్టమిషన్లను మంజూరు చేసింది. అయితే వెలుగు సిబ్బంది నిర్లక్ష్యంతో కుట్టుశిక్షణ కోసం మంజూరు చేసిన కుట్టు మిషన్లను కార్యాలయంలో ఓ మూన పడేసిన దుస్థితి నెలకొంది. ఎప్పుడైనా అధికారులు వివిధ కార్యక్రమాలకు వచ్చి ఇవేమిటని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక కార్యాలయ సిబ్బంది కుట్టుమిషన్లు కనపడకుండా ముసుగువేశారు. ఇదే విషయమై వెలుగు ఏపీఎం శివకుమార్ రెడ్డిని సాక్షి వివరణ కోరగా తాను బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కుట్టుమిషన్లు అలాగే ఉన్నాయన్నారు. ఇదేవిషయమై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని సమాధానమిచ్చారు.

పేరుకుపోయిన అపరిశుభ్రత



అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ అపరిశుభ్రత నెలకొన్న దృశ్యం

యల్లనూరు: మండలంలోని జంగంపల్లి అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ అపరిశుభ్రత పేరుకుపోయింది. గతంలో పాఠశాల భవనం కోసం నిర్మించిన అదనపు తరగతి గదిలో ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాన్ని నడుపుతున్నారు. భవనం పక్కనే ఉన్న తాగు నీటి ట్యాంకు ఉంది. ట్యాంకు నిండిన తర్వాత ఓవర్ ఫ్లో అయ్యే నీళ్లన్నీ అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ నిలుస్తున్నాయి. పరిసర ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తూ దోమలకు నిలయంగా మారింది. నీళ్లన్నీ మురుగుగా నిలిచి పిల్లలు భవనంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా పోతోంది. అలాగే అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పిల్లలు బిక్కుబిక్కుమంటూ చదువులను కొనసాగిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనాన్ని మరమ్మతుల చేయడంతోపాటు ట్యాంకు నీరు భవనం వైపు రాకుండా చూడాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



తాడిపత్రిలో కాకర్స్ గోడౌన్ యజమానులతో మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారులు



యాడికిలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని యల్లనూరు రోడ్డు, కడప రోడ్డులో ఉన్న బాణసంచా గోడౌన్‌ను జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం కోనసీమ జిల్లా రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమై తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గోడౌన్ యజమానులతో మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గోడౌన్‌లో పాటిస్తున్న భద్రతా నియమాలపై ఆరా తీశారు. టపాకాయల దుకాణాల వద్ద పాటించవలసిన భద్రతపై అవగాహన కల్పించారు. ఫైర్ అధికారి మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: టపాసుల దుకాణాల వద్ద యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, సీఐ ఈరన్న, ఇన్‌చార్జి ఎంపీడీఓ శశికళ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టపాసుల విక్రయ కేంద్రాలు పూర్తిగా భద్రతా ప్రమాణాలకు అను గుణంగా ఉండాలన్నారు. భద్రతకు సంబంధించిన నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు దుకాణాల్లో అగ్నిమాపక పరికరాలు, ఇసుక, నీటి క్యాన్లు ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ క్రిష్ణప్ప, వీఆర్వో మధు తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో మెరుగైన సౌకర్యాల కల్పన



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, జేసీ శివ్‌నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: కసాపురం ఆంజనేయస్వామి క్షేత్రంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. గురువారం విజయవాడ నుంచి వివిధ అంశాలపై కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల, ఇతర అధికారులు పాల్గొన్నారు. కసాపురం ఆలయానికి రూ.9 కోట్లు ఆదాయం వస్తోందన్నారు. 192 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ప్రసాదం, ఇతరత్రాలకు రూ.3 కోట్లు ఖర్చు అవుతోందని తెలిపారు. భక్తులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో పీఆర్ ఎస్ఈ సుబ్బరాయుడు, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజునాయుడు, డీఎంహెచ్ఓ ఈబీదేవి, పౌర సరఫరాల సంస్థ జీఎం రమేష్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వేశాఖ ఏడీ రేష్లానాయక్, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీమ్‌బాషా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టేషన్ అభివృద్ధికి సహకరించండి

గుంతకల్లు: గుంతకల్లు-కల్లూరు సెక్షన్‌లోని ఇమాంపురం హాల్ట్‌స్టేషన్ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గ్రామస్తులు ఎం.రాజన్న, మల్లికార్జున, గోవిందు, సుంకమ్మ తదితరులు డీఆర్ఎం చంద్రశేఖర్, సీనియర్ డీసీఎం మనోజ్‌లను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇమాంపురం హాల్ట్ స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైలు మార్గం డబుల్‌లైన్ కావడంతో ఒక లైన్‌కు మాత్రమే ప్లాట్‌ఫారం ఏర్పాటు చేశారు. రెండో లైన్‌కు ప్లాట్‌ఫారం లేకపోవడంతో రైలు ట్రాక్ దాటుకుని రైలు ఎక్కడానికి వృద్ధులు, చిన్నారులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. మరో ప్లాట్‌ఫారం, ఫుట్ ఓవర్ (ఎఫ్ఓబీ) ఏర్పాటు చేయడంతోపాటు ఇమాంపురం హాల్ట్‌స్టేషన్ అభివృద్ధి పరచాలని వారు కోరారు.

కార్పొరేట్ సెలూన్లకు వ్యతిరేకంగా తీర్మానం చేయండి



నైరుతిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న క్షౌరవృత్తిదారుల సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: నాయీ బ్రాహ్మణుల కడుపు కొట్టేలా పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్‌లను తొలగించాలని మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డిని క్షౌరవృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. గురువారం ఆమె నివాసంలో సంఘం జిల్లా కన్వీనర్ బి.శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్ సెలూన్ షాపుల వల్ల నాయీ బ్రాహ్మణ కుటుంబాలు వీధిన పడ్డాయని, వారికి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో క్షౌరవృత్తిదారుల సంఘం కార్యదర్శి సూరి, కోశాధికారి బ్రహ్మ, నాయకులు శంకర్, నరేష్, అజయ్, బాల, సాయి, వాసు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పది మందిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో సీఐ రామారావు, ఎస్ఐ సురేష్ సిబ్బందితో కలిసి గ్రామ శివారులోని పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి.. పేకాట ఆడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ముగిసిన చెన్నకేశవస్వామి ఉత్సవాలు



చెన్నకేశవస్వామి

యల్లనూరు: మండలంలోని లింగారెడ్డిపల్లిలో లక్ష్మీ చెన్నకేశవస్వామి ఉత్సవాలు గురువారం ముగిశాయి. నాలుగు రోజుల పాటు ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామస్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వే మోరీ విస్తరణ చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత జగదీష్

గుంతకల్లు: పట్టణంలోని కసాపురం రైల్వే మోరీ విస్తరణ చేపట్టాలని డీ.జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కసాపురం రైల్వే మోరీ విస్తరణ చేపట్టాలన్నారు. ఆలూరు రోడ్డులో నుంచి పాత గుంతకల్లులోని బీరప్పగుడి సర్కిల్ వరకు రోడ్డు పూర్తిగా అధ్వాన స్థితిలో ఉందన్నారు. దీంతో తరచూ ఈ రోడ్డు యాక్సిడెంట్లు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా గుత్తి నుంచి గుంతకల్లు జాతీయ రహదారి పనులు పూర్తి చేయాలని, మైనార్టీ ఉర్దూ కళాశాలను ప్రారంభించాలని తదితర డిమాండ్లపై ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బీ.గోవిందు, మహేష్, ఎస్.గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాముడురాయల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్లపై కేసులు



మాట్లాడుతున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ గురువయ్య

గుత్తి: విద్యుత్ అక్రమ కనెక్షన్లపై కేసులు నమోదు చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ గురువయ్య సూచించారు. గుత్తిలోని ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈఈ, ఏడీఈలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, ఎనర్జీ లాస్, కలెక్షన్‌ల వసూలు, వర్క్ ఆర్డర్లు, పీఎంఆర్ ఆర్డర్లు వంటి వాటిపై సమీక్షించారు. కలెక్షన్లలను ఇంప్రూవ్ చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు సక్రమంగా పని చేసేలా చూడాలని, విద్యుత్ చోరీకి గురి కాకుండా చర్యలు తీసుకోవాలని, వర్క్ ఆర్డర్లు, పీఎంఆర్ ఆర్డర్లు ఈ నెలాఖరులోపు క్లోజ్ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా విద్యుత్ చోరీకి గురి అవుతున్నట్లెతే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈ పద్మానాభ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

గుత్తి రూరల్/పామిడి: గుత్తి మండలంలోని రజాపురం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు గురువారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయాధికారులు నివేదిత, శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి భూసార పరీక్షలకు సంబంధించి మట్టి నమూనాలు సేకరణ, పరీక్షల గురించి వివరించారు. నేల ఆరోగ్యం, సాయిల్ హెల్త్ కార్డు పోర్టల్, మొబైల్ అప్లికేషన్, వ్యవసాయంలో వాటి ప్రాముఖ్యత, సూక్ష్మ పోషకాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ నాగజ్యోతి, ఆత్మ బీటీఎం లావణ్య, ఆర్ఎస్‌కే సిబ్బంది రవితేజ, అరుణ, నరేంద్ర పాల్గొన్నారు. అలాగే పామిడి మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు భూసార పరీక్ష కేంద్రం అధికారులు పీ శ్రీనాథ్‌రెడ్డి, బీఆర్ శేఖర్‌రెడ్డి మట్టి నమూనాల సేకరణ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ విజయకుమార్, టీచర్ శశికిరణ్, రైతు సేవకేంద్రం సిబ్బంది భార్గవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో ‘ఆస్ట్రేలియా బృందం’



కంప్యూటర్ల పని తీరును పరిశీలిస్తున్న ఆస్ట్రేలియా వ్యాబ్టెక్ బృందం

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఆస్ట్రేలియా వ్యాబ్టెక్ బృందం సందర్శించింది. గతంలో పాఠశాలకు 50 కంప్యూటర్లు వ్యాబ్టెక్ కంపెనీ వితరణ చేసింది. వాటి పని తీరుతో పాటు విద్యార్థులు ఎలా వినియోగిస్తున్నారో? విద్యార్థులకు అవి ఎలా ఉపయోగపడుతున్నాయో గమనించడానికి వ్యాబ్టెక్ వైస్ ప్రెసిడెంట్ న్యూ బోర్స్ డీన్, పలువురు సభ్యులు వచ్చారు. విద్యార్థులు కంప్యూటర్లను ఆన్ చేసి ఫైల్స్ ఎలా తయ్యారు చేయాలో చూపించారు. దీంతో వ్యాబ్టెక్ బృందం సభ్యులు విద్యార్థులను మెచ్చుకున్నారు. అనంతరం ఆస్ట్రేలియా వ్యాబ్టెక్ బృందం విద్యార్థులు, ఉపాధ్యాయులతో గ్రూప్ ఫోటో దిగారు. కార్యక్రమంలో హెచ్ఎం సుంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో సమస్యల తిష్ట



బీకేఎస్ మండలం టీచర్స్ కాలనీలో చిన్నపాటి వర్షానికి రోడ్లు, డ్రైనేజీల దుస్థితి ఇలా...

అనంతపురం నగర శివారు, స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా బుక్కరాయసముద్రం మండల పరిధిలోకి వచ్చే టీచర్స్ కాలనీ పాలకులు, అధికారుల నిరాదరణకు గురవుతోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లలో నడవలేని పరిస్థితి నెలకొంది. ఇక డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో అక్కడున్న ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నా ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేసి, దోమల బెడద నుంచి కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్, అనంతపురం

సంక్షిప్త సమాచారం

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో సురేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ భర్త వేధిస్తున్నాడంటూ భార్య గౌతమి ఫిర్యాదు చేయడంతో సురేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జ్ఞాపక శక్తి

యాడికి: విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంతోనే జ్ఞాపక శక్తి మెరుగవుతుందని మెంటల్ హెల్త్ కౌన్సిలర్లు నాగరాజు, వేణుగోపాల్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సీతా రామాంజనేయులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో డ్రిల్ టీచర్ చంద్రకళ, ఉపాధ్యాయులు రాజశేఖర్ నాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

బుక్కరాయసముద్రం: మండలంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి అన్నారు. గురువారం మండలంలోని సిద్ధరాంపురంలో మండల అధికారులు పర్యటించారు. ముందుగా గ్రామంలో ఉన్న మౌలిక సదుపాయాలపై చర్చించారు. గ్రామంలో ఏఏ సౌకర్యాలు కావాలో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మాన్, ఈఓఆర్డీ సదాశివం, ఏపీఎం అనిత, ఎంఈఓలు నవీద, లింగానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి రూరల్: మండలంలోని చిన్నపోలమడ సమీపంలో గురువారం మట్కా బీటర్‌ను అరెస్టు చేసి, అతడి నుంచి రూ.17150 స్వాధీనం చేసుకున్నామని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. చిన్నపోలమడకు చెందిన రంగనాయకులు మట్కా రాస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు.

వేధింపుల కేసులో నిందితుడి అరెస్టు

తాడిపత్రి రూరల్: వేధింపుల కేసులో కోర్టుకు హాజరుకాని నిందితుడు వెంకటసుబ్బయ్యను గురువారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామని సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన వెంకటసుబ్బయ్యపై వేధింపుల కారణంగా భార్య లక్ష్మిలలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు 22 ఫిబ్రవరి, 2017లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడు కోర్టుకు హాజరు కాకపోవడంతో తాడిపత్రి మేజిస్ట్రేట్ అనిల్‌కుమార్ నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చారు. కడప ఎయిర్‌పోర్టు సమీపంలో నిందితుడు ఉన్నాడన్న సమాచారంతో కానిస్టేబుళ్లు అంకన్న, నరసింహారావులు వెళ్లి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం తాడిపత్రి సబ్‌జైలుకు పంపామని సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి ఘటనలో 10 మందిపై కేసు

యాడికి: మండలంలోని వెంగన్నపల్లిలో బుధవారం ఇరు వర్గాలకు గొడవ పడ్డారు. ఘర్షణలో రామేశ్వర రెడ్డి, ఉదయ భాస్కర్ రెడ్డి, నారాయణ స్వామి, అబ్బిరెడ్డి, నిరంజన్ రెడ్డి, లక్ష్మీదేవి, నవీన్, శివ ప్రసాద్ రెడ్డి, నాగ భూషణం రెడ్డి, లక్ష్మి నారాయణ రెడ్డి తదితరులు కొడవళ్లతో అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్‌పై దాడి చేయగా గాయాలయ్యాయి. విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు గురువారం 10 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లికి చెందిన రమేష్ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమేష్ కుటుంబసమస్యలతో పాటుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడి

యాడికి: పంటల్లో రైతులు సస్య రక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని గుత్తి డివిజన్ వ్యవసాయ సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటరాముడు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కంది పంట, పత్తి పంటలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీఏ వివరించారు. రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ అధికారులు రమేష్, రాంబాబు, యతీష, నాగలక్ష్మి, నిజాముద్దీన్ సాగర్, వర్ష, యాడికి, నిట్టూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయండి

పెద్దపప్పూరు: రామకోటి కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గురువారం ఎంపీడీఓ సురేష్‌కు కాలనీవాసులువినతిపత్రం ఇచ్చారు. తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన బోరుబావిలో నీరు అడుగంటిపోయిందని ఎప్పుడు నీళ్లువస్తాయో తెలియని దుస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోయారు. వారం రోజులుగా నీరు సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు.